RNI No.: TELTEL/2023/90269

# తెలంగాణ షాన్

ప్రతి పదం ప్రజల పక్షం

తెలుగు దిన పత్రిక

# TELANGANA SHAAN

Telugu Daily

Malkajgiri | Volume: 3 | Issue: 208 | Sunday, November 30, 2025 | Editor: RAMANCHARLA SRIKANTH | Pages: 4 | Rs. 4/-

మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 208 | ఆదివారం, నవంబర్ 30, 2025 | ఎడిటర్: రామన్‌చర్ల శ్రీకాంత్ | పేజీలు : 4 | వెల : రూ.4 /-

విలేకరులు కావలెను

తెలంగాణ షాన్

తెలుగు దినపత్రిక

నందు రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
నియోజకవర్గ ఇన్చఛార్జ్‌లు
మండలాల వారిగా విలేకరులు కావలెను

ఆసక్తి గల యువతీ యువకులు

సంప్రదించవలసిన మొబైల్ నెంబర్: 99637 08331

## 'ఐబొమ్మ' అసలు గుట్టు బయటపెట్టిన రవి



**హైదరాబాద్:** సినిమాల పైరసీ కేసులో 'ఐబొమ్మ' నిర్వాహకుడు ఇమంది రవి రెండో విడత కస్టడీ పూర్తయింది. ఈ విచారణలో ఐ బొమ్మ పూర్తి పేరు 'ఇంటర్నెంట్ బోమ్మ' అని నిందితుడు వెల్లడించాడు. విశాఖలో సినిమాను బొమ్మగా పిలిచేవాళ్లమని చెప్పాడు. మరో వెబ్‌సైట్‌కు బలపం అని పేరు పెట్టాలని అనుకున్నట్లు తెలిపాడు. డొమైన్‌లో సాంకేతిక సమస్యతో 'ఎల్' అక్షరం తీసి 'బప్పం' మార్చినట్లు వెల్లడించాడు. విచారణలో భాగంగా పోలీసులు అతడిని 3 రోజుల పాటు ప్రశ్నించి.. కీలక సమాచారం సేకరించారు. పైరసీ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ గురించి పోలీసులకు రవి వివరించాడు. తాను అప్‌లోడ్ చేసిన సినిమాల్నీ టెలిగ్రామ్ నుంచి తీసుకున్నవేనని చెప్పాడు. అనంతరం నిందితుడిని పోలీసులు కోర్టులో హాజరుపరిచారు.

### పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో 10 కీలక బిల్లులు...

## డిసెంబర్ 1 నుంచి ప్రారంభం



**న్యూఢిల్లీ:** పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ 19వ తేదీ వరకూ ఈ సమావేశాలు జరుగుతాయి. సమావేశాలకు ముందు సంప్రదాయంగా నిర్వహించే అఖిలపక్ష సమావేశాన్ని ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఈ అఖిలపక్ష సమావేశం జరుగనుంది. పార్లమెంటు సమావేశాలు సజావుగా జరిగేలా సహకరించాలని కేంద్రం కోరనుంది. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో కీలకమైన పౌర అణు ఇంధన రంగంలో ప్రైవేటు రంగానికి ఆహ్వానం పలికేందుకు ఉద్దేశించిన 'ది ఆటమిక్ ఎనర్జీ బిల్లు-2025'తో సహా 10 కీలక బిల్లులు సభ ముందుకు రానున్నాయి.

పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న కీలకమైన బిల్లులలో 'ది ఆటకమిక్ ఎనర్జీ బిల్లు-2025'తో పాటు సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు (ఎస్ఎంసి)-2025, జాతీయ రహదారుల (సవరణ) బిల్లు, అర్బిట్రేషన్, కాన్సిలియేషన్ (సవరణ) బిల్లు, ఇన్సూరెన్స్ చట్ట (సవరణ) బిల్లు, ఇన్సాల్వెన్సీ, దివాలా కోడ్ (సవరణ) బిల్లు, కార్పొరేట్ చట్ట (సవరణ) బిల్లు, ది హైయర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా బిల్లు-2025, ది మణిపూర్ గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ (సవరణ) బిల్లు-2025, జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు-2025 ఉండనున్నాయి.

సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా చట్టం-1992, డిపాజిటరీస్ చట్టం-1996, సెక్యూరిటీస్ కాంట్రాక్ట్స్ (నియంత్రణ) చట్టం-1956లను విలీనం చేసేందుకు 'సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు-2025'ను కేంద్రం తీసుకువస్తోంది. జాతీయ రహదారుల విస్తరణ, పొడిగింపుకోసం అవసరమైన భూసేకరణ ప్రక్రియ వేగంగా, అత్యంత పారదర్శకంగా జరిగేందుకు వీలుగా నేషనల్ హైవేస్ (సవరణ) బిల్లును తెస్తోంది. చేయని తప్పులకు కంపెనీ డైరెక్టర్లు బాధ్యులు అవుతున్నందున అవాంఛనీయ దర్యాప్తు, విచారణల నుంచి రక్షణ కల్పించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఆర్బిట్రేషన్, కాన్సిలేయేషన్ చట్ట సవరణ బిల్లును పార్లమెంటులో కేంద్రం ప్రవేశపెట్టనుంది. దీనిపై సూచనల కోసం కమిటీకి సిఫారసు చేసే అవకాశం ఉంది. కాగా, ది హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా బిల్లుతో ఏకీకృత ఉన్నత విద్యా కమిషన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం కొత్త బిల్లు తీసుకురానుంది. కాగా, చండీగఢ్ కేంద్ర పాలిత ప్రాంతాన్ని రాజ్యాంగంలోని 240వ అధికరణ పరిధిలోకి తెచ్చే బిల్లు పార్లమెంటులో ప్రవేశపెడతారని అనుకున్నప్పటికీ అలాంటి ఆలోచన ఏదీ లేదని ఇటీవల కేంద్రం ప్రకటించింది.

కాగా, ఈసారి పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో పలు అంశాలను లేవనెత్తేందుకు విపక్షాలు కసరత్తు చేస్తున్నాయి. ప్రధానంగా ఎస్ఐఆర్ ఓటర్ల సవరణ జాబితా, అదానీ అంశం, ఢిల్లీ పొల్యూషన్ వంటి అంశాలను లేవనెత్తే అవకాశాలున్నాయి.

## విద్యుత్ ఉంటేనే అన్ని రంగాలు అభివృద్ధి : భట్టి



**హైదరాబాద్:** స్పష్టమైన అవగాహనతో విద్యుత్ రంగంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తున్నామని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. విద్యుత్ అవసరాలు తీర్చేందుకు ప్రణాళికలు తయారు చేశామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 2047 వరకు 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా చేరాలని తీర్చిదిద్దుతున్నామని, సిఎం రేవంత్ రెడ్డి కేబినెట్ సహచరులు కలిసి నిర్ణయం తీసుకున్నామని తెలియజేశారు. తెలంగాణను ప్రపంచస్థాయి, రాష్ట్రంగా అభివృద్ధి చేయాలని భట్టి అధికారులకు సూచించారు. 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా చేరడానికి పెట్టుబడులు రావాలని, ఉత్పత్తి రంగాలు అభివృద్ధి చెందితేనే ఆశించిన స్థాయిలో ఎకానమీ ఉంటుందని పేర్కొన్నారు. ఆ దిశగా విద్యుత్ తయారు చేసుకోవాలని ప్రణాళికలు చేస్తున్నామని, పదేళ్లుగా రాష్ట్రంలో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 10 శాతం విద్యుత్ డిమాండ్ పెరిగిందని, 2014లో పవర్ డిమాండ్ లో 6,755 మెగావాట్లు ఉండేదని చెప్పారు. 2025లో 18,138 మెగావాట్లకు పెరిగిందని, 2034 నాటికి 39,229 మెగావాట్లకు, 2025 నుంచి ప్రతి ఏటా 8.50 శాతం పెరుగుతుందని అన్నారు. 2047 నాటికి ప్రతి ఏటా 10 శాతం పవర్ గ్రోత్ అవసరం ఉంటుందని, విద్యుత్ ఉంటేనే అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. భవిష్యత్తులో హైదరాబాద్ గ్లోబల్ హబ్ గా మారబోతోందని, 2047 నాటికి లక్ష మెగావాట్ల విద్యుత్ అవసరం ఉంటుందని గుర్తుచేశారు. విద్యుత్ రంగంలో పెట్టుబడులు పెరగాలని, ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తి 24,760 మెగావాట్లు అని..విద్యుత్ స్టోరేజ్ పై ఇప్పటి వరకు ఎలాంటి ప్రణాళికలు చేయలేదని చెప్పారు. విద్యుత్ ను బ్యాటరీ స్టోరేజ్, పంప్ డ్ స్టోరేజ్ ల్లో అందుబాటులోకి తీసుకురావాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోందని అన్నారు. రాష్ట్రంలో 12 ప్రాంతాల్లో పంప్ డ్ స్టోరేజ్ పాయింట్లకు అవకాశం ఉందని, పంప్ డ్ స్టోరేజ్ కు తెలంగాణ అనుకూలమైన రాష్ట్రం అని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## 1200 మంది అమరవీరుల త్యాగాల కంటే కెసిఆర్ దీక్ష పెద్దదా?:ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్



**హైదరాబాద్:** కెసిఆర్ దీక్ష వల్లే తెలంగాణ వచ్చిందని బిఆర్ఎస్ చెప్పుకుంటుందని, కెసిఆర్ దీక్ష ఎలా చేశారో, ఎలాంటి ఫ్లూయిడ్స్ తీసుకున్నారో అందరికీ తెలుసనీ, 1,200 మంది అమరవీరుల త్యాగాల కంటే కెసిఆర్ దీక్ష పెద్దదా?' అని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ప్రశ్నించారు. శనివారం సీఎల్పీ మీడియా సెంటర్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీకాంతాచారి, యాదయ్య, ఇషాన్‌రెడ్డి, కిష్టయ్య వంటి ఉద్యమ వీరుల త్యాగాలను బిఆర్ఎస్ ఎందుకు గుర్తు చేసుకోవడం లేదని ఆయన ధ్వజమెత్తారు. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలంగాణ కోసం చేసిన సేవలను గుర్తుచేస్తూ మాట్లాడితే కెటిఆర్ ఎగిరి పడుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ హయాంలో చిన్నారెడ్డి నాయకత్వంలో సాగిన సంతకాల సేకరణలో మహేష్ గౌడ్ కీలక పాత్ర ఉందని ఆయన గుర్తు చేశారు. సాగరహారం రోజు కెసిఆర్, కెటిఆర్‌లు ఎక్కడ ఉన్నారని దయాకర్ నిలదీశారు. తెలంగాణ సాధనకు వ్యతిరేకంగా కెసిఆర్ అవకాశవాద రాజకీయాలు చేశారని, మిలియన్ మార్చ్‌ను కూడా అడ్డుకున్నారని ఆయన ఆరోపించారు. ఈ ఉదంతంలో కోదండరాం, గద్దర్, అందెశ్రీ, గూడ అంజయ్యలను కెసిఆర్ పట్టించుకోలేదన్నారు.

**తెలంగాణ నిజమైన బిడ్డ రేవంత్ రెడ్డి**

సోనియా గాంధీ వల్లే తెలంగాణ వచ్చిందని కెసిఆర్ అన్నారని, అదే సోనియాను బజారుకీడుస్తున్నారని తర్వాత అనడం నీచ రాజకీయమేనని దయాకర్ విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీని చంపడానికి కెసిఆర్ ప్రయత్నించారని అద్దంకి దయాకర్ ఆరోపించారు. తెలంగాణ నిజమైన బిడ్డ రేవంత్ రెడ్డినేనని పేర్కొంటూ, కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చి సోనియాకు రేవంత్ బహుమతి ఇచ్చారని ఆయన అన్నారు. అందెశ్రీ అంత్యక్రియల్లో సిఎం రేవంత్ వ్యవహారించిన తీరును దేశం చూసి అబ్బురపడిందని ఆయన కొనియాడారు. బిఆర్ఎస్‌లో ఇప్పుడు 420 మాత్రమే మిగిలారని, సర్పంచ్ ఎన్నికల్లో సెంటిమెంట్ కోసం హడావిడి చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. కెసిఆర్ రాజ్యాంగాన్ని మారుస్తానని చెప్పి అంబేద్కర్‌ను అవమా నించారని ఆయన ఆరోపించారు. రాజీవ్ గాంధీ విగ్రహంపై చేయి వేస్తే ఖబడ్దార్ కెటిఆర్ అంటూ అద్దంకి హెచ్చరించారు. తెలంగాణలో బిఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం కల్ల అని ఆయన ప్రకటించారు. ఉద్యమకారులను జైలులో పెట్టిన చరిత్ర కెసిఆర్‌దని, రాక్షసంగా వ్యవహారించారని అని దయాకర్ విమర్శించారు.

## స్థానిక ఎన్నికలు.. ముగిసిన తొలి విడత నామినేషన్ల గడువు




**హైదరాబాద్, నవంబరు 29:** తెలంగాణలో స్థానిక ఎన్నికలకు తొలి విడత నామినేషన్ల గడువు ముగిసింది. తొలి విడతలో 4,236 పంచాయతీలు, 37,440 వార్డుల్లో ఎన్నికలు జరుగనున్నాయి. డిసెంబర్ 3వ తేదీన నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. నామినేషన్ల సందర్భంగా ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. తొలి విడత నామినేషన్ల గడువు ఈరోజు యుగియడంతో రెండో విడత పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. డిసెంబర్ 2వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు ఎన్నికల అధికారులు. డిసెంబర్ 6వ తేదీన రెండో విడత నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియనుంది. కాగా, పలు జిల్లాల్లో సర్పంచ్ పదవికి జోరుగా వేలం పాటలు జరుగుతున్నాయి. సర్పంచ్ పదవీ కోసం పలువురు పోటీపడుతున్నారు. సర్పంచ్ పదవి ఏకగ్రీవం చేయడం కోసం ఎంత ఖర్చు పెట్టెందుకైనా వెనుకడుగు వేయడం లేదు. అయితే, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభ్యర్థుల తరఫున ప్రచారం చేయనున్నారు. ఈ మేరకు పలు జిల్లాల్లో పర్యటిస్తున్నట్లు సీఎం ఓ ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. మరోవైపు.. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై తెలంగాణ హైకోర్టు కూడా కీలక వ్యాఖ్యలు చేసింది. జీఓ నంబరు 46పై హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. ఈ దశలో ఎన్నికలపై స్టే విధించలేమని స్పష్టం చేసింది న్యాయస్థానం. పాత పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించమని తామే చెప్పాం కదా అని న్యాయస్థానం గుర్తుచేసింది. జీఓ నంబరు 46పై తదుపరి విచారణను రెండు నెలలకు వాయిదా వేసింది తెలంగాణ హైకోర్టు.

## జిల్లాలకు పార్టీ ఇన్‌చార్జులను నియమించిన బిజెపి



**హైదరాబాద్:** భారతీయ జనతా పార్టీ (బిజెపి) రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచంద్రరావు రాష్ట్రంలోని 38 జిల్లాలకు పార్టీ ఇన్‌చార్జులను నియమించారు. ఈ మేరకు ఆ జాబితాను శనివారం విడుదల చేశారు. ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే అరుణతార, మంచిర్యాల ఇన్‌చార్జిగా కె.ఓదెలు, నిర్మల్‌కు గోపిడి శ్రవంత్‌రెడ్డి, కొమురం బీం ఆసిఫాబాద్ జిల్లాకు కోమల ఆంజనేయులు, నిజామాబాద్‌కు మాధవరం కాంతారావు, కామారెడ్డికి విక్రమ్‌రెడ్డి, కరీంనగర్‌కు బండారి శాంతికుమార్, జగిత్యాలకు గడ్డం శ్రీనివాస్, పెద్దపల్లికి రాజమౌళిగౌడ్, రాజన్న సిరిసిల్లకు గంగడి మోహన్‌రెడ్డి, సంగారెడ్డికి పెదకుల శ్రీనివాస్, మెదక్‌కు బోఖా నరసింహారెడ్డి, సిద్ధిపేటకు జె.సంగప్ప, రంగారెడ్డి అర్బన్‌కు అలె భాస్కర్, రంగారెడ్డి రూరల్‌కు వీరబెల్లి రఘునాథరావు, వికారాబాద్‌కు ఏ.సుధాకర్‌రావు, మేడ్చల్ అర్బన్‌కు సేవెళ్ల మహేందర్, మేడ్చల్ రూరల్‌కు సామ రంగారెడ్డి, నల్గొండకు ఉదయ్ ప్రతాప్, సూర్యాపేటకు డా.తూటుపల్లి రవికుమార్, యాదాద్రి భువనగిరి జిల్లాకు ఎన్.శ్రీవర్ధన్‌రెడ్డిని నియమించారు. అలాగే మహబూబ్‌నగర్ జిల్లా బిజెపి ఇన్‌చార్జిగా రంజిత్ మోహన్, వనపర్తి జిల్లాకు బొక్కా బాల్‌రెడ్డి, నాగర్‌కర్నూలు జిల్లాకు కెవిఎల్‌ఎన్ రెడ్డి (రాజు), జోగులాంబ గద్వాలకు బాపురెడ్డి, నారాయణ్‌పేట్‌కు మాజీ మేయర్ బండా కార్తీక్‌రెడ్డి, హన్మకొండకు డా.బూర నర్సయ్యగౌడ్, వరంగల్‌కు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు ధషమంత్‌రెడ్డి, జనగాంకు కట్టా సుధాకర్‌రెడ్డి, మహబూబాబాద్‌కు డా.జారుప్లవత్ గోపి (కళ్యాణ్ నాయక్), ములుగుకు డా.కోరాడల నరేష్, ఖమ్మంకు బద్దం మహిపాల్‌రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెంకు డా.విజయ్‌చంద్రారెడ్డి, గోల్కొండ గోషామహల్‌కు యాతిపాటి శ్రీధర్, భాగ్యనగర్ మలక్‌పేట్‌కు జె.రంగారెడ్డి, మహంకాళి సికింద్రాబాద్‌కు నదనం దివాకర్, హైదరాబాద్ సెంట్రల్‌కు వీరెల్లి చంద్రశేఖర్‌లను నియమించినట్లు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు.

## కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు వేగవంతం : కిషన్ రెడ్డి



**హైదరాబాద్:** వరంగల్ విమానాశ్రయం నిర్మాణం వేగవంతం చేయాలని నిర్ణయించామని బిజెపి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. వరంగల్ విమానాశ్రయం నుంచి ముందుగా ఎటిఆర్ విమానాలు నడపాలని నిర్ణయించామని అన్నారు. ఈ సందర్భంగా హనుమకొండలో మీడియాతో మాట్లాడుతూ.. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు కూడా వేగంగా సాగుతున్నాయని, కాజీపేట రైల్వేస్టేషన్ ఆధునికరణ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు చెప్పామని తెలియజేశారు. అమృత్ పథకం కింద వరంగల్ జిల్లాకు రూ.874 కోట్లు మంజూరు చేసిందని, హృదయ్ పథకం కింద పురాతన ఆలయాల పునరుద్ధరణకు కేంద్రం నిధులు ఇచ్చిందని అన్నారు. రామప్ప ఆలయం అభివృద్ధి కోసం కేంద్రం రూ. 146 కోట్లు ఖర్చు చేస్తోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## బాబు సర్కార్ కీలక నిర్ణయం.. ఏపీకి కొత్త సీఎస్



**అమరావతి, నవంబరు29:** ఏపీ నూతన సీఎస్‌గా జి.సాయిప్రసాద్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. 2026 మార్చి ఒకటో తేదీ నుంచి సాయిప్రసాద్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు సాధారణ పరిపాలనా శాఖ పొలిటికల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత సీఎస్ కె. విజయానంద్ పదవీకాలాన్ని మరో మూడు నెలలు (మార్చి 28, 2026) పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది ఏపీ సర్కార్. ఈ మేరకు జీవో నంబర్ 2230ను విడుదల చేసింది ప్రభుత్వం.

మరోవైపు.. పదిమంది డిప్యూటీ కలెక్టర్‌లకు పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు జీవో ఆర్టీ నెంబర్ 2228 జారీ చేశారు సీఎస్ విజయానంద్.

# తెలంగాణ షాన్

## సంపాదకీయం

### పేదల విద్యకు..

# నిధుల కొరతా...?

ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఉన్నత విద్య అనేది ఇప్పటికీ ఒక కల. ఆ కలను సాకారం చేయడానికి ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ముఖ్యమైన సంక్షేమ పథకం ఫీజు రీయింబర్స్‌మెంట్. ఇది పుట్టుకతోనే సామాజిక న్యాయానికి పునాదులు వేసిన పథకం. పేద విద్యార్థుల చదువు డబ్బుల కొరతతో ఆగిపోకూడదని, ప్రతిభకు అవకాశాల ద్వారాలు తెరవాలనే లక్ష్యంతో ప్రారంభమైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో2008లో ప్రారంభమైన ఈ పథకం నేడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ పథకం ఆయా రాష్ట్రాల స్వంత పంథాలో నడుస్తోంది. ఈ పథక లక్ష్యం 'విద్య పేదలకు చేరాలంటే, డబ్బు అడ్డంకి కాకూడదు' అందుకే సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో చేరి ఉన్నత విద్య పొందేలా ప్రభుత్వమే ఫీజు భారం భరించాలనే ఆలోచన నుంచి ఇది రూపుదిద్దుకుంది. ఈ పథకం వల్ల లక్షలాది విద్యార్థులు వివిధ ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశం పొందారు. ఈ పథకం వలన ప్రైవేటు కాలేజీలు కూడా వీరికి ప్రభుత్వ భాగస్వామ్య విద్యా కేంద్రాలుగా మారాయి. ఈ రీయింబర్స్మెంట్ వల్ల సమాజంలో కొన్ని గమనించదగ్గ మార్పులు చోటుచేసుకున్నాయి. పేద కుటుంబాల పిల్లలు ఇప్పుడు ప్రొఫెషనల్ కోర్సులు చదవగలుగుతున్నారు. ఉన్నత చదువు కారణంగా వారికి వృత్తి అవకాశాలు లభించి, పేదరికం నుంచి బయటపడి మధ్యతరగతిలోకి రావడం మొదలైంది. చిన్న ఊర్లలో, మారుమూల తండాల్లో, గిరిజన గూడాల్లో కూడా ఉన్నత విద్యపై ఆసక్తి పెరిగింది. పేద అమ్మాయిలను చదివించడంలో తల్లిదండ్రులు ముందుకు వస్తున్నారు. ఇటీవలి సంవత్సరాల్లో ఫీజురీయింబర్స్‌మెంట్ పథకానికి ప్రభుత్వాల నుండి నిధుల విడుదలలో భారీ ఆలస్యం జరుగుతుంది. కాలేజీలకు రెండు, మూడేళ్ల బకాయిలు పెండింగ్‌లో ఉండటం సాధారణమైపోయింది. ఈ పరిస్థితి విద్యార్థులకు, కాలేజీలకు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు తెచ్చింది. ప్రభుత్వ బడ్జెట్ లోటు, ఎన్నికల ప్రాధాన్యతలు మారడం, రుణాల బరువుతో రాష్ట్ర ఆర్థిక స్థితి దెబ్బతినడం, పథకాన్ని సరైన గణాంకాల ఆధారంగా ప్రణాళిక చేయకపోవడం, అధికార యంత్రాంగంలో ఆలస్యం, ఫైల్ ప్రాసెసింగ్‌లో నిర్లక్ష్యం ఈ పరిస్థితికి కారణాలు. దీని ఫలితంగా విద్యార్థులు సర్టిఫికేట్‌లు అందుకోలేక, ఉన్నత చదువులకు దరఖాస్తు చేయలేక, ఉద్యోగాల ఎంపికలో వెనుకబడుతున్నారు.

ప్రభుత్వానికి సమాంతరంగా విద్యా సేవ అందిస్తున్న ప్రైవేటు కాలేజీలు ఎందుకు వివక్షకు గురవుతున్నాయి అనేదే ఇప్పుడు ప్రశ్న. ఇవి ప్రభుత్వం కోసం విద్యా భాగస్వాములుగా పని చేస్తున్నాయి. పేద విద్యార్థులకు ప్రభుత్వ పథకాల కింద సీట్లు ఇచ్చి, వారికి క్లాసులు, సౌకర్యాలు, సిబ్బందినీ అందిస్తున్నాయి. కానీ రీయింబర్స్మెంట్ మొత్తాలు సకాలంలో రాకపోవడం వల్ల ఈ సంస్థలు జీతాలు, ల్యాబ్ నిర్వహణ, మౌలిక వసతులు అందించడంలో ఇబ్బందులు పడుతున్నాయి. ప్రైవేట్ కాలేజీలు లాభాపేక్షతో కూడినవైనా, వాస్తవంగా ఇవి ప్రభుత్వ బాధ్యతను పంచుకుంటున్న సంస్థలు.

పేద అమ్మాయిలను చదివించడంలో తల్లిదండ్రులు ముందుకు వస్తున్నారు. ఇటీవలి సంవత్సరాల్లో ఫీజురీయింబర్స్‌మెంట్ పథకానికి ప్రభుత్వాల నుండి నిధుల విడుదలలో భారీ ఆలస్యం జరుగుతుంది. కాలేజీలకు రెండు, మూడేళ్ల బకాయిలు పెండింగ్‌లో ఉండటం సాధారణమైపోయింది. ఈ పరిస్థితి విద్యార్థులకు, కాలేజీలకు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు తెచ్చింది. ప్రభుత్వ బడ్జెట్ లోటు, ఎన్నికల ప్రాధాన్యతలు మారడం, రుణాల బరువుతో రాష్ట్ర ఆర్థిక స్థితి దెబ్బతినడం, పథకాన్ని సరైన గణాంకాల ఆధారంగా ప్రణాళిక చేయకపోవడం, అధికార యంత్రాంగంలో ఆలస్యం, ఫైల్ ప్రాసెసింగ్‌లో నిర్లక్ష్యం ఈ పరిస్థితికి కారణాలు. దీని ఫలితంగా విద్యార్థులు సర్టిఫికేట్‌లు అందుకోలేక, ఉన్నత చదువులకు దరఖాస్తు చేయలేక, ఉద్యోగాల ఎంపికలో వెనుకబడుతున్నారు. అందుకే వీటిని వివక్షగా చూడకుండా 'భాగస్వాములు'గా గుర్తించి సహకరించడం సమాజ ప్రయోజనానికి అవసరం. ప్రైవేట్ కాలేజీలు విద్యతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి కూడా కల్పిస్తున్నాయి. వేలాది మంది ఈ కాలేజీల ద్వారా జీవనోపాధి పొందుతున్నారు. నిధుల విడుదలలో ఆలస్యం వలన ఈ వర్గాలపై కూడా తీవ్ర ప్రభావం పడుతోంది. జీతాల ఆలస్యం, ఉద్యోగాల కోతలు, సంస్థల మూతపడే పరిస్థితి, ఇవన్నీ సామాజిక తిరోగమన వృద్ధికి సంకేతాలు. పేద విద్యార్థులకు ఆర్థిక అడ్డంకులు లేకుండా చదివే అవకాశం ఇవ్వడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత. అందుకే ఫీజు రీయింబర్స్‌మెంట్ లాంటి పథకాలు కేవలం ప్రభుత్వ పత్రాలలో ఉండకూడదు. అవి పేద విద్యార్థి ఇంట్లో వెలిగే దీపం. ఒక కుటుంబం చదువుతో ఎదిగితే, దాని ప్రభావం తర తరాల మీద ఉంటుంది. నిధుల ఆలస్యం, వివక్ష, రాజకీయ ప్రాధాన్యతలతో ఈ దీపం ఆరిపోకుండా చూసే బాధ్యత సమాజం మొత్తం మీద ఉంది. నిధుల విడుదలలో ప్రభుత్వాలు మాటలకే పరిమితం కాకుండా, నిధులు సకాలంలో విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును రక్షించాలి. విద్యలో పెట్టుబడి అంటే దేశ భవిష్యత్తులో పెట్టుబడి. ప్రభుత్వం ఈ వాస్తవాన్ని మర్చిపోతే, పేద విద్యార్థుల కన్నీటి చరిత్ర మనం చదవాల్సి వస్తుంది.

## కెసిఆర్ ని మరో మారు ముఖ్యమంత్రి చేసేవరకు ప్రతి నాయకుడు, కార్యకర్త దీక్షగా పనిచేయాలి : ఎమ్మెల్యే కెపి.వివేకానంద్







**కుత్బుల్లాపూర్ నవంబర్ 29 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమిని నాగరాజ్ గౌడ్**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధి గండి మైసమ్మ లోని మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అధ్యక్షతన నిర్వహించిన "దీక్షా దివాస్" కార్యక్రమంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ తో పాటుగా ఎమ్మెల్సీ నవీన్ రావు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, బండారి లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, ఎంబీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్ లు పాల్గొని తెలంగాణ రాష్ట్ర సాధకులు, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....అడుగడుగున అవమానాలు, వివక్షతకు గురైన ఈ ప్రాంతం ప్రత్యేక రాష్ట్ర సాధన ద్వారా ఆవిర్భవించిన తెలంగాణను పదేళ్ల కాలంలో దేశంలోనే అగ్రపథాన నిలిపిన దార్శనికులు, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ గారన్నారు. నాడు తెలంగాణ రాష్ట్రం కోసం తమ పదవులను సైతం తృణప్రాయంగా వదిలేసిన గొప్ప నాయకులు కేసీఆర్ అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన తీరును, ఉద్యమ పంథాను నేటి యువతకు తెలియజేయాలన్నారు. రానున్న తెలంగాణ సార్వత్రిక ఎన్నికల్లో కేసీఆర్ ని మరోమారు సీఎం చేసే వరకు ప్రతీ నాయకుడు, కార్యకర్త ఒక దీక్షతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పౌర హక్కుల దినోత్సవం






**కుత్బుల్లాపూర్ నవంబర్ 29 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమిని నాగరాజ్ గౌడ్**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్ 128డివిజన్ శ్రీనివాస్ నగర్ కాలని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవము నిర్వహించామని కాలని ప్రెసిడెంట్ ముత్యపాగ నర్సింగ్ రావ్ తెలిపారు, ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మండల తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్,గాజులరామారం రెవెన్యూ ఇనస్పెక్టర్, జి ఎచ్ ఏం సి అధికారులు, ఎచ్.ఏం. డబ్ల్యూ. ఎస్. ఎస్. జనరల్ మేనేజర్, ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ అధికారులు, సివిల్ సప్లైస్ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొని ప్రజల హక్కుల గురించి పౌర సేవల గురించి ప్రజలకు వివరించారు,ప్రజలు వివిధ సమస్యల పై అధికారులకు వినతి పత్రం ఇచ్చారు, తహసీల్దార్ అశోక్ కుమార్ ప్రజల సమస్యలపై సానుకూలంగా స్పందించి వెంటనే పరిష్కారం అయ్యేల చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ దళిత సంఘాల మాజీ అధ్యక్షుడు జేమ్స్, ప్రేమ్ కుమార్, బుచ్చయ్య,ముత్యపాగ నర్సింగ్ రావ్, కో గోపాల్,పాండు, వేకల నత్యనారాయణ, మాజీ హెడ్ మాస్టర్ పుండరికం,మహిళ నాయకులు రాణి, తదితరులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ సర్కిల్ టాక్స్ ఇన్స్పెక్టర్ పదవి విరమణ కార్యక్రమంలో పాల్గొన్న.ఎమ్మెల్యే కెపి.వివేకానంద్





**కుత్బుల్లాపూర్ నవంబర్ 29 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమిని నాగరాజు గౌడ్**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 – జీడిమెట్ల డివిజన్ స్వాగత్ గ్రాండ్ హోటల్ నందు నిర్వహించిన కుత్బుల్లాపూర్ సర్కిల్ టాక్స్ ఇన్స్పెక్టర్ మెండు శ్రీనివాస్ రెడ్డి పదవి విరమణ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై మెండు శ్రీనివాస్ రెడ్డి – విజయలక్ష్మి దంపతులకు శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సుదీర్ఘ కాలం దాదాపు 40 సంవత్సరాల పాటు వివిధ హోదాల్లో వారి సేవలను అందించి ట్యాక్స్ ఇన్స్పెక్టర్ గా పదవీ విరమణ పొందిన శ్రీనివాస్ రెడ్డి కీ వయసురీత్యా మాత్రమే పదవీ విరమణ అని, ప్రజా సేవకు పదవి విరమణ ఉండదని అన్నారు. శ్రీనివాస్ రెడ్డి నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ – గాజుల రామారం సర్కిళ్ల ఉప కమిషనర్లు నర్సింహా, మల్లారెడ్డి, వివిధ విభాగాల అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నంబి నారాయణ పెరుమాళ్‌గా సాలగ్రామ నారాయణుడి అద్భుత అలంకరణ

**మేడ్చల్–మల్కాజిగిరి తెలంగాణ షాన్, నవంబర్ 29:**

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ఆనంద్‌బాగ్ ప్రాంతంలో కొలువైన సాలగ్రామ నారాయణుడి ఆలయం శ్రీవైష్ణవ భక్తులతో కళకళలాడింది. శనివారం రోజున స్వామివారు అపురూపమైన నంబి నారాయణ పెరుమాళ్ అలంకరణలో భక్తులకు దివ్య దర్శనం ఇచ్చారు. శ్రీ వైష్ణవ దివ్యదేశ వైభవం ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై వెంకట రమణాచార్యులు మాట్లాడుతూ, ఈ అలంకరణ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. క్షేత్ర మహాత్మ్యం: కర్ణాటక రాష్ట్రంలోని తొండనూర్లో వెలసిన నంబి నారాయణస్వామి కోవెల, పంచ నారాయణ క్షేత్రాలు మరియు 108 శ్రీ వైష్ణవ దివ్యదేశాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందిందని తెలిపారు. ?చారిత్రక నేపథ్యం: ఈ కోవెల సుమారు 5500 సంవత్సరాల పురాతనమైనది. ఈ క్షేత్రాన్ని సుమారు 1000 సంవత్సరాల క్రితం శ్రీ వైష్ణవ ఆచార్యులైన శ్రీ రామానుజులవారు పునరుద్ధరించారని తెలియజేశారు.



**అలంకరణ విశేషం:** అటువంటి పవిత్ర దివ్యదేశంలో కొలువైన నంబి నారాయణస్వామి రూపంలోనే నేడు ఆనంద్‌బాగ్ సాలగ్రామ నారాయణుడు భక్తులను అనుగ్రహిస్తున్నారని, ఈ దర్శనం భక్తులకు అత్యంత పుణ్యఫలాన్ని ఇస్తుందని వివరించారు. స్వామివారి ఈ ప్రత్యేక అలంకరణ దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

## డిసెంబర్ 1 న ముదిరాజ్ మహాసభ తలపెట్టిన నిరసన కార్యక్రమం వాయిదా




**కుత్బుల్లాపూర్ : నవంబర్ 29 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమిని నాగరాజు గౌడ్**

డిసెంబర్ 1న బీసీ"ఏ" సాధన కోసం ఇచ్చిన పిలుపును అఖిల భారత కోలీ సమాజ్ జాతీయ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేష్ ముదిరాజ్ వాయిదా వేశారు...ఈ మేరకు ఆయన శనివారం హైదరాబాదులోని ఓ ప్రయివేట్ హోటల్లో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఈ వాయిదా విషయాన్ని ప్రకటించారు.. .పంచాయితీ ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వం భావించడం ...ఎన్నికల కమిషన్ ఎన్నికల తేదీని ఖరారు చేయడంతో ...రాష్ట్రంలో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి... నిరసన కార్యక్రమాలకు అడ్డంకులు కూడా తలెత్తాయి ..అందుచేత డిసెంబర్ 1న ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు హైవే దిగ్బంధం నిరసన కార్యక్రమాలను వాయిదా వేస్తున్నట్లు వీరేష్ ప్రకటించారు. ఈ సందర్భంగా వీరేష్ మాట్లాడుతూ ...నేను ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ముదిరాజ్ సోదరులు కార్యక్రమం నిర్వహించడానికి సన్నద్ధమయ్యారని...అయినప్పటికీ మనలోని మన సోదరులు, బంధుమిత్రులు, ముదిరాజ్ నాయకులు ఎంతోమంది ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని సంకల్పించారు. వారి విజయం మనందరి బాధ్యత%% మన సంఘటిత మద్దతు వారికి అత్యంత కీలకం. ఈ నేపథ్యంలో, వారి అభ్యర్థన, సూచన మేరకు డిసెంబర్ 1న జరగాల్సిన హైవే దిగ్బంధం మరియు ఇతర నిరసన కార్యక్రమాలను తాత్కాలికంగా వాయిదా వేయాలని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి పూర్తయిన వెంటనే సమావేశం నిర్వహించి,భవిష్యత్తులో మనం చేపట్టబోయే కార్యక్రమాల తేదీలను, తీరుతెన్నులను, మన పోరాటం తదుపరి దశ..ఇవన్నీ సమష్టిగా చర్చించి నిర్ణయించుకుందామని పేర్కొన్నారు..



# రూమర్స్‌పై స్పందించిన రామ్...


యంగ్ హీరో రామ్ పి.మహేశ్‌బాబు డైరెక్షన్ లో తెరకెక్కుతోన్న 'ఆంధ్ర కింగ్ తాలూకా' సినిమాలో భాగ్యశ్రీ బోర్సేని నటిగా చేశారు.

ఈ సినిమా నవంబర్ 27న రిలీజ్ కాబోతోంది. అయితే ఈ మూవీ షూటింగ్ ప్రారంభమైన నాటి నుంచి వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారనే వార్తలు జోరుగా ప్రచారం అవుతున్నాయి. ఈ సినిమా సంధర్భంగా రామ్ ఒక ఇంటర్వ్యూలో భాగ్యశ్రీ బోర్సేతో డేటింగ్ రూమర్స్ గురించి స్పందించారు. ఈ సినిమా కోసం స్వయంగా ఒక ప్రేమ పాట రాశారన్నారు. ఆ సమయంలో రూమర్స్ మొదలవ్వడం విశేషం అని చెప్పారు. అప్పటి నుంచే ఈ రూమర్స్ ప్రారంభమయ్యాయని.. మనసులో ఏం లేకపోతే అంత గొప్పగా పాట ఎలా రాయగలరు అని అందరూ అనుకున్నారు.

ఈ సినిమాలోని హీరో, హీరోయిన్ పాత్రలను ఊహించుకొని ఆ లిరిక్స్ రాశానని పేర్కొన్నారు. ఈ పాట రాసినప్పటికి అసలు హీరోయిన్‌ను ఎంపిక చేయలేదు" అని రామ్ అయిన రూమర్స్ వచ్చాయన్నారు. ఆంధ్ర కింగ్ తాలూకా సినిమా కథ, సంగీతం, యాక్షన్ తో ప్రేక్షకులను ఆకట్టుకోగలదని, తన అభిమానులకు మంచి విజయం తీసుకురాబోతుందని అన్నారు.




## రకుల్ సెన్సేషనల్ కామెంట్స్



'కెరటం' సినిమాతో ఇండస్ట్రీకి వచ్చి తెలుగులో దాదాపు హీరోలందరితో నటించి స్టార్ హీరోయిన్‌గా మారింది అందాల తార రకుల్ ప్రీత్‌సింగ్. రామ్ చరణ్, ఎన్టీఆర్, నాగార్జున, మహేష్ బాబు, రవితేజ వంటి వారితో నటించి పలు హిట్స్ తన ఖాతాలో వేసుకుంది. నాన్నకు ప్రేమతో, సరైనోడు వంటి బ్లాక్ బస్టర్ హిట్ చిత్రాలతో రకుల్ క్రేజ్ మరింది పెరిగిందనే చెప్పాలి. అమ్మడు అందం, అభినయంతో పాటు తన నటనతో ఎంతోమంది అభిమానులను దక్కించుకుంది. అయితే ఒక సినిమా సక్సెస్ అయితేనే వరుస అవకాశాలు రావడం కామన్ అలాంటిది ఎన్నో హిట్స్ సాధించిన రకుల్‌కు కెరీర్ పీక్స్‌లో ఉండగా మహేష్ బాబుతో నటించే చాన్స్ వచ్చింది. అలా ఏఆర్ మురగదాస్, సూపర్ స్టార్ మహేష్ కాంబోలో వచ్చిన 'స్పైడర్'లో హీరోయిన్‌గా నటించింది. అయితే ఈ మూవీ బాక్సాఫీసు వద్ద ఊహించని విధంగా బాక్సాఫీసు వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. భారీ అంచనాల మధ్య వచ్చి ప్రేక్షకులను మెప్పించలేకపోయింది.

రెండు భాషల్లో విడుదలైనప్పటికీ ఎక్కడ కూడా సక్సెస్ సాధించలేకపోయింది. ఇక 2017లో వచ్చిన ఈ సినిమా రకుల్ కెరీర్‌పై ప్రభావం బాగానే చూపించింది. దీని తర్వాత తెలుగులో రకుల్ కనిపించలేదు. బాలీవుడ్ చెక్కేసిన ఈ భామ అక్కడ వరుస చిత్రాల్లో నటిస్తోంది. ఇప్పటికీ బ్యాక్ టు బ్యాక్ ప్రాజెక్ట్స్‌తో ఫుల్ ఫామ్‌లో దూసుకుపోతుంది. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రకుల్ టాలీవుడ్‌కు దూరం అవడంపై సంచలన వ్యాఖ్యలు చేసింది. "నేను తెలుగు ఇండస్ట్రీలో రామ్ చరణ్, ఎన్టీఆర్ వంటి స్టార్ హీరోలతో నటించాను. అలాగే తెలుగులో చాలా ప్రాజెక్ట్స్ చేశాను. వరుసగా8–9 హిట్స్ వచ్చాయి. కానీ 'స్పైడర్' నా కెరీర్‌లో మొదటి డిజాస్టర్ సినిమా. అంచనాలు తారుమారైనప్పుడు ఎలా ఉంటుందో నాకు మొదటిసారి అర్థమైంది. ఇది నాకు నాకు చేధు అనుభవంగా మారింది.

## ఆ పాత్ర చేసేందుకు సిద్ధం..!



తమన్నా మిల్కీ బ్యూటీ ది భారతీయ సినీరంగంలో సక్సెస్ఫుల్ కెరీర్. దక్షిణాదిలో అన్ని భాష ల్లో నటించింది. బాలీవుడ్లో కూడా తన సత్తా చాటింది. కొన్ని సినిమాల్లో ప్రత్యేక గీతాన్ని నటించి, తన సత్తా చాటింది. కొత్త హీరోయిన్ల రాకతో ఆమెకు కొంతమేర అవకాశాలు తగ్గాయి. దాదాపు అన్ని రకాల పాత్రల్లో నటించి, మెప్పించిన మిల్కీ బ్యూటీకి డ్రీమ్ రోల్ ఉందట. అదేమిటంటే చాలా మంది హీరోయిన్లు బయోపిక్ చిత్రాల్లో నటిస్తున్నారు. తనకు కూడా అలాంటి అవకాశం రావాలని కోరుకుంటోంది. అవకాశం వస్తే అతిలోకసుందరి శ్రీదేవి బయోపిక్‌లో నటించాలని ఉందని చెప్పింది. భారతీయ సినీరంగంలో చాలా భాషల్లో బయోపిక్ల నిర్మాణం పెరిగింది. దీన్ని ఉద్దేశించే తమన్నా ఈ వ్యాఖ్యలు చేసింది. "శ్రీదేవి అంటే నాకు చాలా ఇష్టం. ఆమె స్టైలిష్ నటి. ఆమె నటన అంటే అందరికీ అభిమానమే. ఆమె బయోపిక్ తీస్తే శ్రీదేవి పాత్ర చేసేందుకు, అలా నటించేందుకు రెడీ. ఇదే నా డ్రీమ్ రోల్ అని చెప్పింది. 'మహానటి' సావిత్రిగా కీర్తి సురేష్, జయ లలితగా కంగనా రనౌత్, సిల్క్ స్మితగా విద్యాబాలన్ నటించిన విషయం తెలిసిందే. అలాగే శ్రీదేవి బయోపిక్ తీస్తే తను నటిస్తానని తమన్నా అంటోంది. అయితే శ్రీదేవి జీవితం తెరమీద వచ్చేందుకు ఆమె భర్త బోనీకపూర్ అంగీకరించాలి. అదే జరిగితే తమన్నా కోరిక తీరుతుంది.


## దయచేసి అలా చేయొద్దంటూ రిక్వెస్ట్



దయచేసి అలా చేయొద్దంటూ రిక్వెస్ట్

'నీది నాది ఒకే కథ' సినిమాతో తెలుగు ఫిలిమం ఇండస్ట్రీకి దర్శకుడిగా వచ్చిన వేణు ఉడుగుల మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇది బాక్సాఫీసు వద్ద బ్లా బస్టర్ హిట్‌గా నిలవడంతో దర్శకుడి పాపులారిటీ మరింత పెరిగింది. ఆ తర్వాత చేసిన 'విరాట పర్వం' ప్రేమకథగా వచ్చి ఎంతోమంది ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు ప్రశంసలు అందుకుంది. సక్సెస్ సాధించనప్పటికీ ప్రశంసలకే పరిమితం అయిపోయింది. ఈ మూవీతో కాస్త సినిమాలకు గ్యాప్ ఇచ్చిన వేణు 'రాజు వెడ్స్ రాంబాయి' మూవీతో నిర్మాతగా ఎంట్రీ ఇచ్చారు. సాయిలు కంపాటి తెరకెక్కించగా.. నవంబర్ 4న విడుదలైంది. రియల్ స్టోరీతో వచ్చిన ఈ సినిమా బాక్సాఫీసు వద్ద ఎంత పెద్ద సక్సెస్‌ను సాధించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఇందులో నటించిన వారు కొత్త వారు అయినప్పటికీ మంచి ఓపెనింగ్స్ సాధించడమే కాకుండా సినీ సెలబ్రిటీలతో ప్రశంసలు పొందుతోంది. సక్సెస్‌ఫుల్‌గా థియేటర్స్‌లో రాణిస్తూ.. భారీ కలెక్షన్లు రాబడుతోంది. ఈక్రమంలో.. తాజాగా, 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమా సక్సెస్ ఈవెంట్ నిర్వహించగా.. ఇందులో పాల్గొన్న వేణు స్టేజ్‌పై చాలా ఎమోషనల్ అయిపోయాడు. "మేము సినిమాను కొంతమందికి చూపించాం. ఒక పెద్ద మనిషిని పిలిచాం. అతనితో పాటు ఒక నలుగురు ఐదుగురు వచ్చారు. ఇంటర్వెల్ అయింది చెప్పా పెట్టకుండా వెళ్లిపోయారు. ప్రివ్యూ వేస్తే నచ్చలేదని దొంగల్లా మధ్యలో పారిపోయారు. ఒక నిర్మాతకు ఇంతకంటే బాధాకరమైన విషయం ఇంకొటి ఉండదు. బయటకు వెళ్లి నెగెటివ్ ప్రచారం మొదలెట్టారు. వాడు డైరెక్టర్ కాదు.. సినిమా తీయడానికే రాదు అన్నారు. కానీ జనాలు మా చిత్రాన్ని గుండెల్లో పెట్టుకున్నారు. మేము గెలిచామని ఈ మాటలు చెప్పడం లేదు. ఎవరు ప్రివ్యూకి పిలిచినా వెళ్లండి.. కానీ దయ చేసి మీకిష్టం లేకపోతే మధ్యలో రాకండి. సాయిలు నాకు సంగీత దర్శకుడు సురేష్ బొబ్బిలి వల్ల పరిచయం అయ్యాడు. స్వచ్ఛమైన మట్టి మనిషి అలా అడుగుతుంటే నా గుండె తరుక్కుపోయింది. ఒకరోజు షాపింగ్‌కు వెళ్లినప్పుడు ఎక్కువ రేటు బట్టలు చూసి కూడా షాక్ అయ్యాడు. ఇతనిలో నన్ను నేను చూసుకున్నాను. ఈ రోజు నేను చెబుతున్నాను బాగా గుర్తు పెట్టుకోండి. కొన్ని సంవత్సరాలు పోతే తెలుగులో ఫిలిం ఇండస్ట్రీలో వెట్రిమారన్, రంజిత్ ఆ స్థాయిలో సాయిలు కంపాడి ఉంటాడు" అని చెప్తూ చాలా ఎమోషనల్ అయ్యారు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది.

## ఓటీటీలోకి రవితేజ 'మాస్ జాతర'





రవితేజ, శ్రీలీల ప్రధాన పాత్రల్లో నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మాస్ జాతర' ఇప్పుడు ఓటీటీలోకి వస్తోంది. అక్టోబర్ 31న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం భారీ అంచనాలను సంతరించుకుంది గానీ, బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయాన్ని సాధించలేకపోయింది. అయితే మాస్ మహారాజ్ అభిమానులకు ఇప్పుడు ఈ చిత్రం డిజిటల్‌గా చూడడానికి అవకాశం లభిస్తోంది.

నెట్‌ఫ్లిక్స్ ఈ నెల 28నుంచి 'మాస్ జాతర' ను స్ట్రీమింగ్ చేయనుందని అధికారికంగా ప్రకటించింది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో ఈ చిత్రం అందుబాటులో ఉండనుంది. థియేటర్లలో మిస్ చేసిన ప్రేక్షకులకు ఇది మంచి గుడ్ న్యూస్ అవుతోంది. వేణు శ్రీరాం దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం, రవితేజ మాస్ ఇమేజ్‌కు తగిన విధంగా యాక్షన్, ఎంటర్‌టైన్‌మెంట్ మేళవింపుగా రూపొందింది. సంగీతాన్ని థమన్ అందించగా, ప్రొడక్షన్ విలువలు కూడా ఆకట్టుకొన్నాయి. థియేటర్ రన్ ఇంతకుముందు అనుకున్నంతగా లేకపోయినా, ఓటీటీలో ఈ సినిమాకు మంచి వ్యూస్ వచ్చే అవకాశం ఉందని ఫిలింసర్కిల్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. నవంబర్ 28 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో 'మాస్ జాతర' జాతర మొదలుకానుంది.

## 'అరసన్'లో మరో స్టార్ హీరో...

### ఇక ఫ్యాన్స్‌కు పూనకాలే!



కోలీవుడ్ స్టార్ హీరో శింబు నటిస్తున్న 49వ చిత్రం 'అరసన్'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. నేషనల్ అవార్డు గ్రహీత వెట్రిమారన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను అనౌన్స్ చేస్తూ రిలీజ్ చేయగా, శింబు వింటేజ్ లుక్‌లో కత్తి, సైకిల్, రక్తపు మరకలతో కనిపించారు. ఇది వెట్రిమారన్ మార్క్ యాక్షన్ డ్రామాగా ఉంటుందని అభిమానులు భావిస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. ఇందులో కథానాయికగా సమంత నటించే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ సినిమా మీద హైప్‌ని రెట్టింపు చేసే అప్‌డేట్ వచ్చింది. 'అరసన్' చిత్రంలో వెర్సటైల్ స్టార్ విజయ్ సేతుపతి కూడా కీలక పాత్ర పోషిస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఆయన గెటప్‌ని రివీల్ చేస్తూ విడుదల చేసిన పోస్టర్ ఫ్యాన్స్‌ను విపరీతంగా ఆకట్టుకుంటోంది.

పాత్ర చిన్నదైనా, పెద్దదైనా విజయ్ సేతుపతి పూర్తిస్థాయిలో లీనమైపోతారనే విషయం తెలిసిందే. దీంతో వెట్రిమారన్, శింబు, విజయ్ సేతుపతి కాంబో తెరపై అద్భుతాలు సృష్టించడం ఖాయమని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. ఇందులో కథానాయికగా సమంత నటించే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ సినిమా మీద హైప్‌ని రెట్టింపు చేసే అప్‌డేట్ వచ్చింది. 'అరసన్' చిత్రంలో వెర్సటైల్ స్టార్ విజయ్ సేతుపతి కూడా కీలక పాత్ర పోషిస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఆయన గెటప్‌ని రివీల్ చేస్తూ విడుదల చేసిన పోస్టర్ ఫ్యాన్స్‌ను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.

## అమర్ సింగ్ చంకీలకు నిరాశ.!




53వ ఇంటర్నేషనల్ ఎమీ అవార్డ్స్ 2025 వేడుక న్యూ యార్క్‌లో అట్టహాసంగా జరిగింది. కెల్లీ రిపా, మార్క్ కాన్స్యూ లోస్ హోస్ట్ చేసిన ఈ కార్యక్రమంలో హాలీవుడ్ కు చెందిన ప్రముఖులు ఈ వేడుకలో సందడి చేశారు. అయితే ఈ అవార్డుల బరిలో భారత్ తరపున పోటీలో నిలిచిన 'అమర్సింగ్ చంకీలకు నిరాశ ఎదురైంది. రెండు విభాగాల్లో పోటీలో నిలిచిన ఈ చిత్రం ఎందులోనూ అవార్డును సొంతం చేసుకోలేకపోయింది. దీంతో ఇండియాకు ఒక్క అవార్డు కూడా రాలేదు. ఇంతియాజ్ అలీ తెరకెక్కించిన అమర్ సింగ్ చంకీల.. బెస్ట్ మినీ సిరీస్, ఉత్తమ నటుడు విభాగాల్లో నామినేషన్ దక్కించుకుంది. ఒక్క విభాగంలోనైనా విజయం సాధిస్తుందని ఎదురుచూసిన ప్రేక్షకులకు నిరాశ ఎదురైంది. ఉత్తమ మినీ సిరీస్ విభాగంలో 'లాస్ట్ బాయ్స్ 'అండ్ ఫెయిరీస్' విజేతగా నిలవగా.. ఉత్తమ హీరోగా ఓరియోల్ ఫా అవార్డును అందుకున్నారు. ఇక 27 ఏండ్ల వయసులోనే హత్యకు గురైన ప్రముఖ పంజాబీ గాయకుడు అమర్ సింగ్ చంకీల జీవితం ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొంచారు.

Edited, Published and Owned by **Ramancharla Srikanth** & Printed by **V. Raj Kumar** at **RK PRINTERS**, # 1-7-210/2, Kamala Nagar, Opp ECIL Bus Stop, ECIL, Hyderabad, Telangana - 500062 & Published from Sri Lakshmi Narsimha Colony, Flat No.106. Balaji Nagar, Kapra, Medchal Dist., Telangana - 500087. **RNI No.: TELTEL/2023/90269**. Editor: **RAMANCHARLA SRIKANTH**, Mob: **9963708331**, Email: telanganashaan331@gmail.com